బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

- ఎమ్మెల్యేలు తొగురు ఆర్థర్, శిల్పా చక్రపాణిరెడ్డి
- భారత రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

నందికొట్కూరు: బడుగు, బలహీన వర్గ ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేజీ రోడ్డుపై ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మన దేశానికి రాజ్యాంగం రచించి దిశానిర్దేశం చూపిన మహానుభావుడు అంబేడ్కర్ అన్నారు. స్వార్థానికి అర్థం తెలియని నిస్వార్థుడని, దేశంలోని అన్ని కులాలకు సమాన హక్కులను కల్పించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. మార్కెట్ యార్డు కార్యాలయంలో చైర్పర్సన్ షేక్ రహత్, డైరెక్టర్లు జలీల్, అహ్మద్, సాత్విక్, దినేష్, లక్ష్మీదేవమ్మ, సెక్రటరీ కృష్ణా నాయక్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ షేక్ అబ్దుల్ షుకూర్, కౌన్సిలర్లు ధర్మారెడ్డి, జాకీర్ హుసేన్, కొణిదేల సర్పంచు నవీన్‌బాబు, ఉప సర్పంచు భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రమణ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దిలీప్, నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు మరువలేనివి

ఆత్మకూరు : భారతరాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం అనంతరం అంబేడ్కర్ దేశ రాజ్యాంగ రచన కోసం ఎంతో శ్రమించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్ కల్పించడంలో ముఖ్యపాత్ర పోషించారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, దరగమ్మ, పార్వతి, బాలస్వామియాదవ్, కురుకుంద శంకర్‌రెడ్డి, జయకృష్ణ, సుల్తాన్, మొమిన్‌మునీర్‌బాషా, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలోని సీపీయం కార్యాలయంలో బుధవారం డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి సభను నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీపీయం పార్టీ పట్టణకార్యదర్శిరణధీర్, మాబాష, సుధాకర్ మాట్లాడుతూ దేశంలో అన్ని కులమతాలకు భిన్నత్వంలో ఏకత్వం కల్పించి ప్రజా స్వామ్యదేశంగా అంబేడ్కర్ భారత్‌రాజ్యాంగం రచించడం గొప్ప విషయం అని చెప్పారు. అంతకుముసుపు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు సురేంద్ర, గణపతి, నూర్‌అహ్మద్, మల్లయ్య, జెబివుల్లా, తదితరులు పాల్గొన్నారు.
- పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రషీద్, కౌన్సిలర్లు పార్వతి, రెహమాన్, ముర్తుజా, మోతుల్లా, కలిముల్లా, తహసీల్దార్ కార్యలయంలో తహసీల్దార్ ఉమాదేవి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి సభను నిర్వహించారు. పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద మాలమహానాడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు రాబిన్‌సన్, మల్లయ్య, శీలం శేషు పాల్గొన్నారు.

పాములపాడు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి సామాజిక రాయలసీమ రాష్ట్ర సాధన నాయకులు డాక్టర్ నాగన్న పూల మాల వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీకృష్ణ, ఉప సర్పంచు నరసింహులు, ప్రజా సంఘాల నాయకులు గోపాల్, అబ్రహం, స్వాములు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, పార్టీ కార్యకర్తలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్‌లో ఐటీడీఏ అధికారులు బి.ధనుంజయ, పి.ప్రదీప్, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు జి.ప్రకాష్, జి.లక్ష్మయ్య, పి.వెంకటేశ్వర్లు తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జూపాడుబంగ్లా: అంబేడ్కర్ ఆశయాలు నేటి సమాజంలోని ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని సర్పంచ్ మొట్టిబాలస్వామి, ఎంపీటీసీ కృపాకర్ తెలిపారు. మండలకేంద్రంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ట్రాన్స్‌కో ఏడీఈ భగవాన్‌దాసు, రజకసంఘం నాయకులు బస్తిపాటి మౌలాలి, డీలర్ ఆంజనేయులు, ఆర్ఎంపీ ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే వైకేపీ కార్యాలయంలో ఏపీఎం అంబమ్మ, సీసీలు గాంధీ, నాగన్న, రమేష్ తదితరుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు.

కొత్తపల్లి: అంబేడ్కర్ ఆశయాలను సాధిద్దామని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఈ.రాజు పిలుపునిచ్చారు. మండలంలోని దుద్యాల గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సంపంగి మద్దిలేటి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


మార్కెట్ యార్డులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న చైర్‌పర్సన్ షేక్ రహత్

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని నాగటూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్లు, అయ్యన్న, అమర్నాథ్‌రెడ్డి, రియాజ్, సొసైటీ డైరెక్టర్ మధు, తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వెలుగోడు: కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రామదాసు ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. సీఐటీయూ మండల మండల నాయకులు నాగమోహన్,వెంకటయ్య,కిషోర్,కష్ణ, పాల్గొన్నారు.

మహానంది: బుక్కాపురం మజరా గ్రామం పుట్టుపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల రఘురామిరెడ్డి, కుంచపు శ్రీనివాసులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

క్లుప్తంగా

గిరిజన విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలి


గిరిజన గూడెంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గోపీకృష్ణ

పాములపాడు: గిరిజన విద్యార్థుల పై మరింత శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ గోపీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని వేంపెంట గ్రామ చెంచు గూడెంను సందర్శించారు. జీఈఆర్ సర్వేను పరిశీలించారు. చెంచు కాలనీ పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని పంచాయతీ కార్యదర్శి తిప్పన్నను ఆదేశించారు. ప్రతి రోజు పిల్లలను బడికి పంపించాలని గిరిజన మహిళలకు సూచించారు. జ్యోతి బాయి అనే పదో తరగతి విద్యార్థిని రెండు నెలలుగా బడికి వెళ్లడం లేదని గుర్తించి, తల్లిదండ్రులతో మాట్లాడి బడికి పంపేందుకు ఒప్పించారు. సర్పంచ్ మాణిక్యమ్మ, హెచ్ఎం కృష్ణమూర్తి, గిరిజన పాఠశాల హెచ్ఎం ఎల్లమ్మ, పీఈటీ నాగరాజు, సీఆర్పీ మల్లికార్జున పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో లాభాలు


టెంకాయ మొక్కలను పరిశీలిస్తున్న అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్

పాములపాడు: ఉద్యాన పంటల సాగుతో లాభాలు మెండుగా ఉంటాయని జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని జూటూరు, తుమ్మలూరు గ్రామాల్లో పొలాల గెట్ల వెంట రైతులు నాటుకున్న టెంకాయ, మునగ మొక్కలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలను జాగ్రత్తగా సంరక్షించుకుంటే లాభసాటిగా ఉంటుందని వివరించారు. మునగ పంటలో ఎకరానికి 2లక్షల వరకు ఆదాయం పొందవచ్చ చెప్పారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో టీఏలు, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. రైతులకు, ప్రజలకు ఉపయోగ పడే పనులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీకృష్ణ, ఏఓ విమలమ్మ, జేఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంపై అవగాహన సదస్సు


ఈవీఎంపై పనితీరును పరిశీలిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

ఆత్మకూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రానున్న ఎన్నికల సందర్భంగా బుధవారం ఈవీఎంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ఉమాదేవి ఈవీఎం లు ఎలా పనిచేస్తాయి, వాటిని ఎలా ఉపయోగించాలి..?, తదితర విషయాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో పోలింగ్ సిబ్బందికి వాటిని నిర్వహించే విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివ అంటే క్షేమం, మోక్షం


డాక్టర్ మేడసాని మోహన్

శ్రీశైలంటెంపుల్: శివ అంటే క్షేమం, మోహం, శాంతం అనే అర్థాలున్నాయని ప్రవచన కర్త డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. శ్రీశైల దేవస్థాన ధర్మప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రవచన కార్యక్రమం రెండో రోజు బుధవారం కూడా కొనసాగింది. ఆయన మాట్లాడుతూ పరమేశ్వరుడు కల్యాణ రూపుడని, ఆ స్వామి ఆనంద స్వరూపుడన్నారు. ఈ సృష్టిలో అణువణువునా పరమేశ్వరతత్త్వం వ్యాపించిందన్నారు.

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి


హెల్త్ కార్డులు అందిస్తున్న డాక్టర్ సుబ్బారెడ్డి

మహానంది: పాడి పశువుల ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం తమ్మడపల్లె రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులకు పలు అంశాలపై సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు హెల్త్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా పాడి పశువుల ఆరోగ్యం కోసం ఎప్పటికప్పుడు సరైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవచ్చన్నారు. వీఎల్ఓ సులోచన ఆధ్వర్యంలో రైతుల పాడి పశువులకు హెల్త్ కార్డులు పంపిణీ చేశారు.

నమోదు చేయించండి

జూపాడుబంగ్లా: ఆడుదాం-ఆంధ్ర క్రీడాపోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా చేయాలని ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి పీఈటీలకు సూచించారు. బుధవారం మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలతో సమావేశం నిర్వహించారు. 15ఏళ్ల పైబడి వయసు ఉన్న విద్యార్థులతో క్రీడలకు దరఖాస్తు చేయించాలన్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నందికొట్కూరు: సహకార కేంద్ర బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ చీఫ్ మేనేజర్ కే.సరోజమ్మ కోరారు. బుధవారం పట్టణంలోని సహకార బ్యాంక్‌లో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సహకార బ్యాంక్‌లను బలోపేతం చేసేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేసిందన్నారు. రైతులకు తక్కువ వడ్డీతో అధిక రుణాలు ఇచ్చిన బ్యాంక్ సహకార బ్యాంకేనని చెప్పారు. ఇంటింటికి సహకారం సహకార సమైక్య డిపాజిట్ పథకం ద్వారా కరెంటు ఖాతా, సే వింగ్ ఖాతా తెరవడంతో అధిక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఈ పథకం ద్వారా జీరో ఖాతాను తెరవ డం జరుగుతుందని చెప్పారు. ప్రధానమంత్రి సురక్షా బీమా సౌకర్యం, ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై ఆకర్షణీయమైన వడ్డీరేటు అందిస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా ఏటీ ఎం కార్డు ఇవ్వనునట్లు చెప్పారు. ఈ అవకాశం వచ్చే జనవరి 30వ తేదీ వరకు మాత్రమే ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


కే. సరోజమ్మ సహకార బ్యాంక్ చీఫ్ మేనేజర్

వేంపెంట సొసైటీకి రూ.కోటి మంజూరు


నిధుల మంజూరు పత్రాన్ని చూపుతున్న సొసైటీ చైర్మన్ వెంకటస్వామి

పాములపాడు: వేంపెంట సొసైటీకి 2023–24 సంవత్సరానికి సంబంధించి రైతు నేస్తం కింద రూ.కోటు మంజూరయ్యాయని సొసైటీ చైర్మన్ వెంకటస్వామి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ 1–5 ఎకరాల్లోపు రైతులకు రూ.10 లక్షలు, నీటి పారుదల పొలాలకు ఎకరాకు రూ.2లక్షలు, వర్షాధార భూములకు ఎకరాకు రూ.లక్షన్నర చొప్పున రుణం ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే రాజన్న చేయూత కింద రూ.20లక్షలు నిధులు ఉన్నాయని, రైతులు ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో సీఈఓ సునిల్, జేసీఎస్ మండల కన్వీనర్ నాగరాజు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి

మిడుతూరు: సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జగన్ మోహన్ హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ వలంటీర్ నంబర్‌తో ఫోన్ చేస్తూ.. విజయవాడ హెడ్ ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తున్నామని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పడలేదని చెబుతారన్నారు. లబ్ధిదారులకు ఎందుకు డబ్బులు పడలేదో? కారణం తెలుసుకొని దానిని కరెక్షన్ చేస్తున్నామని, మీకు డబ్బులు పడతాయని నమ్మించి, ఫోన్‌పే యూపీఐ నంబర్ తెలుసుకొని అకౌంట్ల నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకుంటున్నారని తెలిపారు. అలాంటి వారిపట్ల జాగ్రత్త ఉండాలని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలి

కొత్తపల్లి: అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు హరిత, నామణి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు యాప్‌ల భారం తగ్గించాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, గ్రాడ్యుటీ, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అంకమ్మ, సునీత, లక్ష్మీదేవి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.కోటి మంజూరు

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి టీటీడీ ఈఓ ధర్మారెడ్డి సహకారంతో రూ.కోటి మంజూరైనట్లు ఈఓ వెంకటరమణ బుధవారం తెలిపారు. ఈ నిధులతో త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

అడిగిన వెంటనే పని

కొత్తపల్లి: గ్రామాలలో జాబు కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి అడిగిన వెంటనే ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా పనులు కల్పిస్తామని ఏపీఓ రేష్మ తెలిపారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయ సమావేశ భవనంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీలకు త్వరగా పనులు కల్పించాలని సూచించారు. అదేవిధంగా 100 రోజుల పనిదినాలకు చేరువలో ఉన్న కుటుంబాలకు మిగిలిన పనిదినాలను త్వరగా పూర్తిచేయాలని చెప్పారు.

నేటి నుంచి విళక్కి పూజలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గుడిపాటి గడ్డలో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఈ నెల 7వ తేదీ నుంచి 44వ మండల విళక్కి మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టిశ్రీధర్, గురుస్వామి లక్ష్మయ్య తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో పోస్టర్లను విడుదల చేశారు.

మీ అభిమానం మరువలేనిది

- బస్సు యాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు

ఆత్మకూరు: పట్టణంలో నవంబర్ 24న నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెబుతున్నానని, మీ అభిమానం మరువలేనిదని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం వివిధ మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పొదుపు మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బస్సు యాత్రకు ఊహించని విధంగా మహిళలు వేల సంఖ్యలో తరలిరావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఆయనపై ఉన్న అభిమానం, ఆదరణతో పెద్ద సంఖ్యలో తరలివచ్చారని చెప్పారు. మహిళలు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఓపికతో బస్సు యాత్ర ముగిసే వరకు ఉండడం పట్ల కృతజ్ఞతలు చెప్పున్నానన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామి యాదవ్, దరగమ్మ, పార్వతి, ఎల్లారెడ్డి, వరాల మాలిక్, పుల్లారెడ్డి, మునీర్‌బాషా, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన రజక సంఘం నాయకులు

పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయలో బుధవారం ఎమ్మెల్యే శిల్పాను రజక సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. రజక సంఘం నాయకులు శోభన్‌బాబు, రమణ, శివన్నలు మాట్లాడుతూ రజకులకు దోబీఘాట్ వద్ద సమస్య ఉందని, ఈ సమస్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కరించారని చెప్పారు. అలాగే కాల్వకు, బోరుకు మరమ్మతు చేయించి నీటి సౌకర్యం కల్పించారన్నారు.

నాగరాజు కుటుంబానికి పరామర్శ

మహానంది: బండిఆత్మకూరు మండలం భోజనం గ్రామానికి చెందిన పాత్రికేయుడు నాగరాజు భార్య ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన తెలుసుకున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గ్రామానికి చేరుకుని నాగరాజు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాస రెడ్డి, సర్పంచ్ బారెడ్డి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

నందికొట్కూరు: అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లకు, ఆయాలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం కోరారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ వర్కర్ల, ఆయా సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి, నాయకులు గోపాలకృష్ణ, నాగన్న, ఆంజనేయులు, శివలక్ష్మి, హరిత తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో పాలన సంబంధమైన విషయాలపై పంచాయతీ కార్యదర్శిలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉప్పేంద్రరెడ్డి, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుళ్ల వితరణ

పగిడ్యాల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు రమణారావు పాఠశాలకు ఆరు టెబుళ్లను విరాళంగా అందజేశారు. ఈ మేరకు బుధవారం పాఠశాల హెచ్ఎం మధుసూదన్‌రావుకు టేబుళ్లను అప్పగించారు. దీంతో ఉపాధ్యాయుడిని హెచ్ఎం, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్‌మియా, పీడీ కృష్ణ, సీఆర్పీ మధునాయుడు, క్రీడాశ్రీ పితాంబ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లలను గుర్తించండి

మిడుతూరు: ఇంటింటికి తిరిగి బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గోవిందనాయక్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని తలముడిపి, రోళ్లపాడు, అలగనూరు, జలకనూరు, చెరుకుచెర్ల, బైరాపురం, తిమ్మాపురం గ్రామాలను సందర్శించి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి, ఎంఈఓ -2 శ్రీనాథ్, పశువైద్యాధికారి సాయినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

పాములపాడు: 5–18 సంవత్సరాల్లోపు పిల్లలందరూ తప్పనిసరి పాఠశాల, కళాశాలల్లో చదవుతూ ఉండాలని జీఈఆర్ స్పెషల్ ఆఫీసర్, నంద్యాల ఎల్‌డీఎం రవీందర్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గోపీకృష్ణ, ఎంఈఓ 2 సుభాషిణీదేవి, ఏపీఎం అనురాధలతో సమావేశమై జీఈఆర్ సర్వేపై చర్చించారు.

కొత్తపల్లి: కొత్తపల్లి గూడెం, పాలెంచెరువు, చదరంపెంట గూడెంలలో ఎంపీడీఓ మేరి జీఈఆర్ సర్వేపై తనిఖీలు నిర్వహించారు. గూడెలలో ఇంటింటికి తిరిగి ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, ఏం చదువుతున్నారు, ప్రస్తుతం పాఠశాలకు వెళ్తున్నారాలేదా అని తల్లిదండ్రులను ఆరాతీశారు.

బాలలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు

వెలుగోడు: బాల,బాలికలను పనుల్లో పెట్టుకుంటే యజమానులపై చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి.శారా హెచ్చరించారు. బుధవారం వెలుగోడు పట్టణంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో షాపుల యజమానులను చైతన్యవంతం చేశారు. బడి ఈడు పిల్లలను బడిలోనే చదివిద్దాం.. బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దామన్నారు.

సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి జగనన్న


సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి

ఆత్మకూరు: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రదాతగా నిలిచారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, జేఎస్ఈ లక్ష్మీరెడ్డి, సుబ్బారెడ్డి, ద్రోణారెడ్డి, గ్రామసర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ శాంతమ్మ అన్నారు. మండలంలోని నల్లకాల్వ గ్రామంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నల్లకాల్వ గ్రామ పరిధిలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.20,20,60,948 లు మంజూరు చేశారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటసుబ్బయ్య, కృష్ణ, ఎల్లయ్య , కొత్తరామాపురం శివరాం, రవినాయక్ , నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు సహకరించండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

నంద్యాల: ఓటర్ల జాబితాలో నమోదు, సవరణలకు సంబంధించి క్లెయిమ్స్, అభ్యంతరాలను ఈ నెల 9వ తేదీ వరకు స్వీకరిస్తామని ఇందుకు రాజకీయ పార్టీలు ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలానీ శామూన్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ప్రత్యేక ఓటర్ల సవరణ – 2024, క్లెయిమ్స్, అభ్యంతరాలు తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జేసీ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య తదితరులతో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు దరఖాస్తులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్ల జాబితాలో పొందుపరిచి జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 34,912 అన్ని రకాల ఫారమ్స్ పెండింగులో ఉన్నాయని వీటిని పరిశీలించి జాబితాలో నమోదు చేస్తామని చెప్పారు. అన్ని నియోజకవర్గాల్లో ప్రతి వారం ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా 10,800 దరఖాస్తులు స్వీకరించామని, ఎన్నికల సంఘం సూచించిన సాఫ్ట్‌వేర్ ద్వారా ఫొటో మిస్ మ్యాచింగ్ చిరునామా తదితర అంశాలను పరిశీలించి సరిచేస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో విచారణలో అన్ని రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను పంపించాలని సూచించారు. జిల్లాకు 30 వేల ఎపిక్ కార్డ్స్ వచ్చాయని, ఇంకా 90,000 ఎపిక్ కార్డ్స్ రావాల్సి ఉందన్నారు. ఎన్నికల సమాచారం కొరకు కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఓటరు నమోదు పట్ల అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు జాకీర్ హుసేన్, కాంగ్రెస్ నుంచి సయ్యద్ రియాజ్ బాషా, టీడీపీ నుంచి శివరామిరెడ్డి, మధు సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలు

పగిడ్యాల: స్థానిక వైకేపీ కార్యాలంలో సెమీ క్రిస్టమస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏపీఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. కొవ్వొత్తులు వెలిగించి కేక్‌కట్‌చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం


వర్షిత తల్లి ఓబులమ్మకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎంపీపీ

మహానంది: బ్యాంకాక్‌లో జరిగే జంప్ రోప్ థాయ్ ల్యాండ్ ఓపెన్ టోర్నమెంట్లో పాల్గొననున్న మహానంది మండలం, గోపవరం గ్రామానికి చెందిన చెవుల చిన్న వెంకటరమణ, ఓబులమ్మల కుమార్తె వర్షితకు ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని రూ. 10వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు బుధవారం నగదును వర్షిత తల్లికి అందజేశారు. కార్యక్రమంలో గోపవరం సొసైటీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అశోక్ రెడ్డి పాల్గొన్నారు.